క్లుప్తంగా

అరుణాచల క్షేత్రంలో ప్రత్యేక పూజలు



అరుణాచల క్షేత్రంలో స్వామి వారిని దర్శిచుకుంటున్న భక్తులు

ప్రత్తిపాడు రూరల్: మండలంలోని రాచపల్లి అపితకుచాంబ సమేత అరుణాచలేశ్వరస్వామి క్షేత్రంలో సోమవారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయ పండితులు ఉదయం స్వామి వారికి పంచామృత అభిషేకాలు, విశేష పూజలు నిర్వహించారు. మహిళలు సామూహిక కుంకుమ పూజలు, పారాయణలు చేశారు. అధిక సంఖ్యలో భక్తులు స్వామి, అమ్మవార్లను దర్శించుకొని తీర్థ ప్రసాదాలు స్వీకరించారు. ఆలయ పీఠాధిపతి రమణస్వామి ఏర్పాట్లను పర్యవేక్షించారు.

రైతులకు మెరుగైన సేవలు



సొసైటీ అధ్యక్షుడిగా బాధ్యతలు స్వీకరించిన సూరిబాబును అభినందిస్తున్న ఎంపీపీ దొరబాబు

గండేపల్లి: సొసైటీ పరిధిలో రైతులకు అందుబాటులో ఉండి మెరుగైన సేవలు అందిస్తానని ఉప్పలపాడు పీఏసీఎస్ నూతన అధ్యక్షుడు పాము సూరిబాబు పేర్కొన్నారు. మండలంలోని ఉప్పలపాడు పీఏసీఎస్ కార్యాలయంలో సోమవారం ఆయన సొసైటీ అధ్యక్షుడిగా బాధ్యతలు స్వీకరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తనపై నమ్మకంతో సొసైటీ అధ్యక్ష పదవి అప్పగించిన ఎమ్మెల్యే జ్యోతుల చంటిబాబుకు ధన్యవాదాలు తెలిపారు. సొసైటీ పరిధిలోని బొర్రంపాలెం, సుబ్బయమ్మపేట, ఉప్పలపాడు గ్రామాల రైతులకు సొసైటీ ద్వారా రుణాలు, ఎరువులు అందిస్తామన్నారు. డైరక్టర్లుగా గొల్లపల్లి రామకృష్ణ, చెరుకు సత్యనారాయణ బాధ్యతలు చేపట్టారు. సొసైటీ నూతన పాలక వర్గానికి ఎంపీపీ చలగళ్ల దొరబాబు, వైస్ ఎంపీపీ కుంచే రాజా, బొర్రంపాలెం సర్పంచ్ పోకల సుబ్బు, అడబాల శ్రీను అభినందనలు తెలిపారు.

దుకాణదారుల ఆందోళన



ఏలేశ్వరం ప్రధాన రహదారిపై ఆందోళన చేస్తున్న దుకాణదారులు

ఏలేశ్వరం: ఆక్రమణల పేరుతో తమ దుకాణాలు తొలగించారని, ప్రభుత్వం తమను ఆదుకోవాలంటూ పట్టణంలోని దుకాణదారులు సోమవారం ఆందోళన చేశారు. స్థానిక బాలాజీ చౌక్ వద్ద రహదారిపై మానవహారంగా ఏర్పడి నిరసన తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ అధికారులు తమ దుకాణాలను తొలగించడంతో తీవ్రంగా నష్టపోయామన్నారు. జీవనాధారం కోల్పోయిన తమకు అధికారులు ప్రత్యామ్నాయ మార్గం చూపించాలని కోరారు. కార్యక్రమంలో అలమండ నాగేంద్ర కుమార్, గోవిందరావు, గోవింద్, భద్రరావు పాల్గొన్నారు.

చిరస్మరణీయుడు బీపీ మండల్

ప్రత్తిపాడు: బీసీల రిజర్వేషన్ల కోసం పోరాడిన బీపీ మండల్ చిరస్మరనీయుడని నియోజకవర్గ బీసీ సంఘ నాయకుడు గొంప శివకుమార్ యాదవ్ అన్నారు. ప్రత్తిపాడులో సోమవారం మండల్ డేను ఘనంగా నిర్వహించారు. బీపీ మండల్ చిత్ర పటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా శివకుమార్ యాదవ్ మాట్లాడుతూ బీపీ మండల్ ఏర్పాటు చేసిన కమిటీని ప్రభుత్వం ఆమోదించిన రోజును మండల్ డేగా జరుపుకుంటున్నామని తెలిపారు. సమాజంలో ఏ వర్గమైనా ఉన్నత స్థానాన్ని పొందాలంటే ఆ వర్గానికి రాజ్యాధికారం అవసరమన్నారు. కార్యక్రమంలో బీసీ సంఘ నాయకులు నైదాన రఘు, సానబోయిన కుశరాజు, కుండల శ్రీను, కొల్లు గంగబాబు, ఫక్కుర్తి కిరణ్ తదితరులు పాల్గొన్నారు.

ఏలేరు కాలువపై వంతెన శిథిలం



గుమ్మరేగుల వద్ద ఏలేరు ఎడమ కాలువపై శిథిలమైన వంతెన

రౌతులపూడి: రౌతులపూడి–ఎస్.పైడిపాల రహదారిలో గుమ్మరేగుల వద్ద ఏలేరు ఎడమ కాలువపై వంతెన శిథిలస్థితికి చేరింది. వంతెనపై వేసిన సిమెంట్ కాంక్రీట్ శ్లాబ్ బీటలు వారి కూలేందుకు సిద్ధంగా ఉంది. ఈ వంతెనపై నిత్యం వందలాది చిన్నవాహనాలు, పదుల సంఖ్యలో భారీ వాహనాలు తిరుగుతున్నాయి. దీంతో ఈ వంతెనపై వెళ్లే ప్రయాణికులు భయభ్రాంతులకు గురవుతున్నారు. ఈ వంతెనకు శాశ్వత ప్రాతిపదికన మరమ్మతులు చేయాలని గతంలో అనేక సార్లు అధికారులకు ఫిర్యాదు చేసినా పట్టించుకోవడం లేదని స్థానికులు ఆరోపిస్తున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి ఈ వంతెన అభివృద్ధికి చర్యలు చేపట్టాలని ప్రజలు కోరుతున్నారు.

అల.. ప్రగతి పథంలో...

- తుని పట్టణంలో జోరుగా అభివృద్ధి పనులు
- రూ.4.35 కోట్లతో సీసీ రోడ్ల నిర్మాణం
- రూ.కోటితో గణపతినగర్ పార్కు సుందరీకరణ
- ఆనందం వ్యక్తం చేస్తున్న ప్రజలు



తుని గణపతినగర్ పార్కులో జరుగుతున్న అభివృద్ధి పనులు

తుని: పురపాలక సంఘంలో అభివృద్ధి పరుగులు పెడుతోంది. ఈ ఏడాది తుని మున్సిపాలిటీ పరిధిలో రూ.4.35 కోట్లతో అభివృద్ధి పనులు చేపట్టారు. గత పాలకుల నిర్లక్ష్యానికి సజీవ సాక్ష్యంగా నిలిచిన పలు ప్రాంతాలను ప్రస్తుత పాలకవర్గం అభివృద్ధి చేసి చూపించింది. ఎన్నో ఏళ్ల నాటి సమస్యలకు పరిష్కారం లభించడంతో ప్రజలు ఆనందం వ్యక్తం చేస్తున్నారు.

పర్యటించి...పరిష్కరించి..

వైఎస్సార్ సీపీ ప్రభుత్వం అధికారంలోకి రావడం, పురపాలక సంఘాన్ని కై వసం చేసుకోవడంతో తునిలో అభివృద్ధికి అడుగులు పడ్డాయి. రాష్ట్ర రోడ్లు, భవనాలశాఖ మంత్రి దాడిశెట్టి రాజా గడప గడపకూ మన ప్రభుత్వం కార్యక్రమం, మన మున్సిపాలిటీ–మన బాధ్యత కార్యక్రమంలో భాగంగా మున్సిపల్ చైర్‌పర్సన్ ఏలూరి సుధారాణి వార్డుల్లో పర్యటించారు. ప్రజలు తమ సమస్యలను వీరికి వివరించారు. ప్రజల విన్నపాలను బుట్టదాఖలు చేయకుండా నిర్ణీత సమయంలోనే పరిష్కరించారు. ఎన్నో ఏళ్లుగా అభివృద్ధికి ఆమడ దూరంలో



తుని ఎస్వీ డిగ్రీ కళాశాల మార్గంలో నిర్మించిన సీసీ రోడ్డు

ఉన్న ప్రాంతాలకు రవాణా సదుపాయాలు కల్పించారు. ఏడు నెలల వ్యవధిలో 3.10 కిలో మీటర్ల మేర సీసీ రోడ్లను రూ.2.60 కోట్లతో నిర్మించారు. రూ.25 లక్షలతో సీసీ కాలువ, రాజా రాజబాబు



తుని కోమాకులవారి వీధిలో నిర్మించిన రోడ్డు

మున్సిపల్ పార్కు, గణపతినగర్ పార్కు రూ.కోటితో పనులు చేపట్టారు. ఈ ఏడాది డిసెంబర్ నెలాఖరుకు పనులు పూర్తి చేస్తామని మున్సిపల్ కమిషనర్ ప్రసాదరాజు తెలిపారు.

రోడ్లు నిర్మించిన ప్రాంతాలు

పట్టణ పరిధిలోని పలు వార్డుల్లో మౌలిక వసతులను కల్పించారు. అమ్మాజీపేట మెయిన్ రోడ్డు, గణపతినగర్ ఎస్వీ డిగ్రీ కళాశాల రోడ్డు, బాలాజీ రోడ్డు, శాంతినగర్, ముక్తిలింగం గారి వీధి, వడ్ల బంగారమ్మ వీధి, కోమాకులవారి వీధి, గాంధీ నగర్, టైలర్స్ కాలనీ, పోస్టు మాస్టర్ వీధి, నెహ్రూనగర్, సమ్మంగివారి వీధి, సమతా గ్యాస్ రోడ్డులను నూతనంగా నిర్మించారు. గణపతి నగర్ పార్కు సుందరీకరణ పనులు ప్రస్తుతం జరుగుతున్నాయి. వీటితో పాటు పలు ప్రాంతాల్లో సీసీ కాలవల నిర్మాణ పనులు చురుగ్గా సాగుతున్నాయి.

మాట నిలబెట్టుకున్నాం



మన మున్సిపాలిటీ–మన బాధ్యత కార్యక్రమంలో ఇంటింటికీ వెళ్లి ప్రజల సమస్యలు అడిగి తెలుసుకున్నాం. ఆయా వార్డుల్లో జనాభాను పరిగణలోకి తీసుకుని సీసీ రోడ్లు నిర్మించాం. తక్కువ సమయంలోనే ప్రజలకు ఇచ్చిన మాటను నిలబెట్టుకున్నాం. మంత్రి దాడిశెట్టి రాజా సహకారంతో ప్రజలకిచ్చిన వాగ్దానాలను అమలు చేయడం సంతోషంగా ఉంది.

–ఏలూరి సుధారాణి, మున్సిపల్ చైర్‌పర్సన్, తుని

ఉద్యోగుల సమస్యల పరిష్కారానికి కృషి



ఇర్రిపాకలో ఎన్జీవో రాష్ట్ర మహాసభల వాల్‌పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్యే జ్యోతుల చంటిబాబు

ఎమ్మెల్యే జ్యోతుల చంటిబాబు

జగ్గంపేట: ఉద్యోగుల సమస్యల పరిష్కారానికి ప్రభుత్వం కృషి చేస్తోందని ఎమ్మెల్యే జ్యోతుల చంటిబాబు అన్నారు. మండలంలోని ఇర్రిపాకలో ఏపీ ఎన్జీఓ 21వ రాష్ట్ర మహాసభల వాల్‌పోస్టర్‌ను ఆయన సోమవారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఎన్జీఓ సంఘం నేతలు తమ సమస్యలను ఎమ్మెల్యే చంటిబాబుకు వివరించారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ కోవిడ్ సమయంలో చనిపోయిన ఉద్యోగుల కుటుంబాలకు కారుణ్య నియామకాలు చేపట్టేందుకు ఇప్పటికే ప్రభుత్వం జీవో విడుదల చేసిందన్నారు. ప్రభుత్వం నుంచి వారికి రావాల్సిన బకాయిలను విడుదల చేస్తారన్నారు. జగ్గంపేటలో ఏపీ ఎన్జీఓ భవన నిర్మాణానికి స్థలం కేటాయించినట్టు చెప్పారు. పలువురు సంఘ నేతలు పాల్గొన్నారు.

చేనేత కార్మికుల సంక్షేమానికి పెద్దపీట



బొద్దవరంలో సీఎం జగన్, మంత్రి రాజా చిత్రపటాలకు క్షీరాభిషేకం చేస్తున్న నేతన్నలు

కోటనందూరు: చేనేత కార్మికుల సంక్షేమానికి సీఎం జగన్‌మోహన్‌రెడ్డి పెద్దపీట వేస్తున్నారని ఎంపీపీ లగుడు శ్రీనివాసు అన్నారు. జాతీయ చేనేత దినోత్సవం సందర్భంగా సోమవారం బొద్దవరంలో సర్పంచ్ వేగి లక్ష్మి అధ్యక్షతన నిర్వహించిన సమావేశంలో ఎంపీపీ ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. తొలుత సీఎం జగన్, మంత్రి దాడిశెట్టి రాజా చిత్రపటాలకు నేతన్నలు క్షీరాభిషేకం చేశారు. ఈ సందర్భంగా ఎంపీపీ శ్రీనివాసు మాట్లాడుతూ ప్రభుత్వం నేతన్నలకు సంవత్సరానికి రూ.24 వేలు అందిస్తోందన్నారు. రాష్ట్రంలో చేనేత వస్త్రాల అమ్మకానికి, ఎగుమతులకు ప్రత్యేక కార్పొరేషన్ ఏర్పాటు చేశారన్నారు. ప్రభుత్వ పథకాలను సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో వైస్సార్ సీపీ నాయకులు వేగి అప్పలనాయుడు, దొడ్డి బాబ్జి, ఎంపీడీఓ సుబ్రహ్మణ్య శర్మ, నేత కార్మికులు పాల్గొన్నారు.

చేనేత కళాకారులకు సత్కారం



ప్రత్తిపాడులో చేనేత కళాకారులను సత్కరిస్తున్న ఎంపీపీ కాంతిసుధాకర్

ప్రత్తిపాడు: చేనేత కళాకారులకు ప్రభుత్వం అండగా నిలుస్తోందని ఎంపీపీ గోళ్ల కాంతి సుధాకర్ అన్నారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో సోమవారం జాతీయ చేనేత దినోత్సవం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంపీడీఓ ఎంవీఆర్ కుమార్‌బాబు అధ్యక్షతన జరిగిన సభలో ఎంపీపీ కాంతి సుధాకర్ మాట్లాడుతూ గతంలో ఏ ప్రభుత్వం చేనేతలను ఆదుకోలేదన్నారు. ప్రస్తుతం కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు నేత వస్త్రాలు, కార్మికులను ప్రోత్సహిస్తున్నాయన్నారు. అనంతరం ఒమ్మంగి గ్రామానికి చెందిన చేనేత కళాకారులు జాగు అప్పారావు, పలివెల రంగారావులను ఎంపీపీ కాంతి సుధాకర్ శాలువా, పూలమాలలతో సత్కరించారు. కార్యక్రమంలో ఈఓపీఆర్డీ కాశీ విశ్వనాథం, మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ శేరు కృష్ణ, ఏపీఎం ఏబీవీ నాయుడు, హౌసింగ్ ఏఈ కె.వెంకటేశ్వరరావు, పంచాయతీ కార్యదర్శి ద్విభాష్యం శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

సమన్వయంతోనే గ్రామాల అభివృద్ధి

- ఎంపీపీ తోట రవి
- కిర్లంపూడిలో మండల సర్వసభ్య సమావేశం



సమావేశంలో మాట్లాడుతున్న ఎంపీపీ తోట రవి

కిర్లంపూడి: అధికారులు, ప్రజా ప్రతినిధుల సమన్వయంతోనే గ్రామాల అభివృద్ధి సాధ్యమని ఎంపీపీ తోట రవి అన్నారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో సోమవారం ఎంపీడీఓ బడే రాజేశ్వరరావు అధ్యక్షతన జరిగిన మండల సర్వ సభ్య సమావేశానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఎంపీపీ రవి మాట్లాడుతూ ప్రజాప్రతినిధులు, అధికారులు గ్రామాల్లో పర్యటించి ప్రజల సమస్యలు తెలుసుకోవాలన్నారు. ప్రజాప్రతినిధులు గ్రామాల్లో విద్యుత్, ఎన్ఆర్ఈజీఎస్, అంగన్‌వాడీ సెంటర్ల నిర్మాణాలతో పాటు పలు సమస్యలను సమావేశం దృష్టికి తీసుకొచ్చారు. ఆయా సమస్యల పరిష్కారానికి చర్యలు తీసుకోవాలని ఎంపీపీ అధికారులకు సూచించారు. శాఖల వారీగా ప్రగతిని సమీక్షించారు. అనంతరం ఈ నెల 10న నిర్వహించే జాతీయ నులి పురుగుల నిర్మూలన పోస్టర్‌ను ఎంపీపీ తోట రవి ఆవిష్కరించారు. కార్యక్రమంలో తోట గాంధీ, సర్పంచ్ మహేంద్రాడ శ్రీలత, వైస్ ఎంపీపీ బొద్దేటి గణపతి, బీసీ కార్పొరేషన్ డైరెక్టర్లు బిళ్లకుర్తి నాగమణి, మొల్లేటి సరస్వతి, సంఘన వెంకటేశ్వరరావు, తహసీల్దార్ కేవీ మాధవరావు తదితరులు పాల్గొన్నారు.

నాయకత్వ లక్షణాలతో వ్యక్తిత్వ వికాసం



సమావేశంలో మాట్లాడుతున్న ఆర్‌జేడీ నాగమణి

గండేపల్లి: నాయకత్వ లక్షణాలు వ్యక్తిత్వ వికాసానికి దోహదం చేస్తాయని పాఠశాల విద్యాశాఖ ఆర్‌జేడీ జి.నాగమణి అన్నారు. మండలంలోని సూరంపాలెం ఆదిత్య ఇంజినీరింగ్ కళాశాలలో హెచ్‌ఎంలకు నాలుగో బ్యాచ్ లీడర్ షిప్ ట్రైనింగ్ శిక్షణ శిబిరాన్ని సోమవారం ఆమె ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆర్‌జేడీ నాగమణి మాట్లాడుతూ హెచ్‌ఎంలు మారుతున్న టెక్నాలజీకి అనుగుణంగా బోధనా పద్ధతులను, నాయకత్వ లక్షణాలను మార్చుకోవాల్సిన అవసరం ఉందన్నారు. సమర్థవంతమైన నాయకుడు ఉన్నప్పుడే వ్యవస్థలు సక్రమంగా పని చేస్తాయన్నారు. సమగ్ర శిక్షా దీక్ష యాప్ స్టేట్ కో ఆర్డినేటర్, లీడర్ షిప్ ట్రైనింగ్ రాష్ట్ర పరిశీలకులు ఇస్మాయిల్ మాట్లాడుతూ హెచ్‌ఎంలు పాఠశాలల అభివృద్ధికి ప్రణాళికాబద్ధంగా కృషి చేయాలన్నారు. ప్రధానోపాధ్యాయులు పాఠశాలలకే పరిమితం కాకుండా విద్యార్థుల పురోగతిలో తల్లిదండ్రులను భాగస్వాములను చేయాలన్నారు. హెచ్‌ఎంల పనితీరును మెరుగుపర్చుకోవడానికి, నాయకత్వ లక్షణాలు పెంపొందించుకోవడానికి ఈ శిక్షణ ఎంతగానో దోహదపడుతుందన్నారు. అనంతరం కాకినాడ, తూర్పుగోదావరి, కోనసీమ ఏఎంవోలు ఎంవీ రామారెడ్డి, గౌరీశంకర్, రాంబాబు మాట్లాడారు. సమావేశంలో పశ్చిమగోదావరి, కాకినాడ, కోనసీమ, తూర్పుగోదావరి జిల్లాల్లలకు చెందిన ప్రధానోపాధ్యాయులు పాల్గొన్నారు.

సంఘ పటిష్టతకు కృషి చేయాలి



ప్రత్తిపాడులో భట్రాజుల సంఘ నాయకులను సత్కరిస్తున్న సంఘ సభ్యులు

ప్రత్తిపాడు: సంఘ పటిష్టతకు ప్రతి సభ్యుడు కృషి చేయాని ఏపీ భట్రాజుల సంఘం కార్యదర్శి కంతస్ఫూర్తి పండు కోరారు. ప్రత్తిపాడు భటరాజుల సంఘం ప్రథమ వార్షికోత్సవం సందర్భంగా సోమవారం స్థానిక సత్తెమ్మ తల్లి అమ్మవారి ఆలయంలో సంఘ సమావేశం జరిగింది. ఈ సందర్భంగా పండు మాట్లాడుతూ సమస్యల సాధనకు సంఘటితంగా పోరాడాలని పిలుపు నిచ్చారు. అనంతరం భట్రాజుల సంఘ ఏర్పాటుకు పాటుపడిన సంఘ జిల్లా అధ్యక్షుడు కంతస్ఫూర్తి సత్తిరాజు, జిల్లా ప్రధాన కార్యదర్శి జనపనేని చలంరాజు, జిల్లా కోశాధికారి ఊడిమూడి శ్రీనివాసరాజు, సంఘ ట్రస్ట్‌బోర్డు సభ్యుడు కె.రాజబాబులను శాలువా, పూలమాలలతో ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో సంఘ సభ్యులు పాల్గొన్నారు.

మణిపూర్ ఘటనకు నిరసనగా ర్యాలీ



కిర్లంపూడిలో శాంతి ర్యాలీ చేస్తున్న క్రైస్తవులు

కిర్లంపూడి: మణిపూర్‌లో గిరిజన మహిళలు, క్రైస్తవులపై జరుగుతున్న దాడులకు నిరసనగా సోమవారం కిర్లంపూడిలో శాంతి ర్యాలీ నిర్వహించారు. మండల పాస్టర్స్ వెల్ఫేర్ అసోసియేషన్ సెక్రటరీ కె.కిరణ్‌కుమార్ ఆధ్వర్యంలో పాస్టర్లు, క్రైస్తవులు కిర్లంపూడి ప్రధాన రహదారిపై ర్యాలీ చేశారు. స్థానిక ఏనుగువీధి సెంటర్‌లో మానవహారంగా ఏర్పడి మణిపూర్‌లో శాంతిని నెలకొల్పాలంటూ నినాదాలు చేశారు. ఈ సందర్భంగా మండల పాస్టర్స్ వెల్ఫేర్ అసోసియేషన్ అధ్యక్షుడు వై.మీకా మాట్లాడుతూ మణిపూర్‌లో గత కొంత కాలంగా మహిళలపై దాడులు జరుగుతున్నా కేంద్ర ప్రభుత్వం మౌనం వహించడం దారుణమన్నారు. ఇప్పటికైనా కేంద్రం స్పందించి హింసాకాండను ఆపాలన్నారు. లేకుంటే ఉద్యమాన్ని తీవ్రతరం చేస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో జి.చిట్టిబాబు, దాసు బాబు, రాజ్‌పాల్ ఉన్నారు.

గోకవరం: మణిపూర్ ఘటనను నిరసిస్తూ గోకవరంలో సోమవారం శాంతి ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఎరుకుల ఏకలవ్య సంఘం అధ్యక్షుడు కాళ్ల భీమరాజు మాట్లాడుతూ ప్రపంచ దేశాలు మన దేశ సంస్కృతి, సాంప్రదాయలను కొనియాడుతుంటే మణిపూర్‌లో ఇటువంటి ఘటనలు జరగడం సిగ్గుచేటన్నారు. భవిష్యత్తులో ఇటువంటి ఘటనలు జరగకుండా ప్రభుత్వాలు చర్యలు తీసుకోవాలని కోరారు. కార్యక్రమంలో సంఘ ఉపాధ్యక్షుడు జల్తా నాగరాజు, సెక్రటరీ రావుల మారయ్య, జాయింట్ సెక్రటరీ నక్కా రాజేష్, ట్రెజరర్ మర్రి మారయ్య పాల్గొన్నారు.

ట్రిపుల్ ఐటీకి విద్యార్థిని ఎంపిక



ఇసరపు సంధ్య

ప్రత్తిపాడు రూరల్: మండలంలోని గజ్జనపూడి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలకు చెందిన ఇసరపు సంధ్య నూజివీడు ట్రిపుల్ ఐటీకి ఎంపికైనట్టు పాఠశాల ప్రధానోపాధ్యాయుడు బి.శ్రీనివాస్ సోమవారం తెలిపారు. పదో తరగతిలో 562 మార్కులు సాధించిన సంధ్య రెండో విడత కౌన్సిలింగ్‌లో నూజివీడు ట్రిపుల్ ఐటీలో సీటు దక్కించుకుంది. విద్యార్థిని సంధ్యను ఎంఈఓ వి.రాజబాబు, స్కూల్ పీఎంసీ చైర్మన్ బర్ల లోవరాజు, గ్రామ సర్పంచ్ గొనగాల అప్పలరాజు, ఎంపీటీసీ మొల్లి వీరబాబు, శాలివాహన అభివృద్ధి కమిటీ జిల్లా సభ్యుడు అనకాపల్లి నూకరాజు తదితరులు అభినందించారు.

ఇంటి పన్ను వసూలుకు స్పెషల్ డ్రైవ్



టీజే నగరంలో ఇంటిపన్ను వసూలు చేస్తున్న పంచాయతీ అధికారులు

కోటనందూరు: ఇంటి పన్ను వసూలుకు స్పెషల్ డ్రైవ్ నిర్వహిస్తున్నట్లు పంచాయతీ విస్తరణాధికారి జి.అరుణ్‌కుమార్ తెలిపారు. బిళ్లనందూరు, ఇండుగపల్లి, టీజే నగరం గ్రామాల్లో జరుగుతున్న ఇంటి పన్ను వసూలును సోమవారం ఆయన పరిశీలించారు. పంచాయతీ సిబ్బందితో ఇంటింటికీ వెళ్లి పన్ను వసూలు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మండలంలో పాతబకాయిలు రూ. 13.17 లక్షలు ఉండగా కొత్త బకాయిలు రూ.56.35 లక్షలు ఉన్నాయన్నారు. ఎరియర్స్ వసూలుపై ప్రత్యేక దృష్టి సారించాలని పంచాయతీ సిబ్బందిని ఆదేశించామన్నారు. ఈ నెలాఖరుకు పాతబకాయిలు 100 శాతం వసూలు చేయాలని లక్ష్యాన్ని నిర్ధారించామన్నారు. ఇంటిపన్ను బకాయిదారులు స్వచ్ఛందంగా ముందుకొచ్చి పన్నులు చెల్లించాలని కోరారు. కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శులు కుశిరెడ్డి అప్పలరాజు, పృధ్వి, రావాడ రామచంద్రకుమార్ పాల్గొన్నారు.

ప్రజా గాయకుడు గద్దర్ మృతికి సంతాపం

జగ్గంపేట: తన విప్లవ గీతాలతో శత్రువుకు సవాల్ విసురుతూ అన్నివర్గాల పీడిత ప్రజలను ప్రజా యుద్ధానికి సిద్ధం చేసిన ప్రజా యుద్ధనౌక గద్దర్ అని ఆంధ్రప్రదేశ్ రైతు కూలీ సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కర్నాకుల వీరాంజనేయులు అన్నారు. జగ్గంపేట శివారు రంగవల్లి నగర్‌లో సోమవారం ప్రజాగాయకుడు గద్దర్ సంతాప సభ నిర్వహించారు. గద్దర్ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఆయన ఆత్మకు శాంతి కలగాలని మౌనం పాటించారు. గద్దర్ మరణం విప్లవోద్యమానికి తీరనిలోటని అన్నారు. కార్యక్రమంలో రైతు కూలీ సంఘం నేతలు డి.సురేష్, దాన్ శ్రీను, మంగమ్మ దేవి పాల్గొన్నారు.

ఎన్నికలకు సిద్ధం కావాలి

తుని రూరల్: రాష్ట్ర అసెంబ్లీకి ముందస్తు ఎన్నికలు జరిగే అవకాశం లేదని, షెడ్యూల్ ప్రకారం జరిగే ఎన్నికలకు నాయకులు, కార్యకర్తలు సిద్ధం కావాలని టీడీపీ నాయకుడు, శాసన మండలిలో ప్రతిపక్ష నేత యనమల రామకృష్ణుడు అన్నారు. తేటగుంట శివారు రాజులకొత్తూరులోని తన అతిథి గృహంలో సోమవారం టీడీపీ నియోజకవర్గ సమన్వయకర్తల సమావేశం ఆ పార్టీ రాష్ట్ర ఆర్గనైజింగ్ కార్యదర్శి యనమల కృష్ణుడు అధ్యక్షతన జరిగింది. అభ్యర్థి ఎవరైనప్పటికీ చంద్రబాబునాయుడే అభ్యర్థిగా భావించి నియోజకవర్గంలో విజయానికి కృషి చేయాలన్నారు. టీడీపీపై ప్రజల్లో విశ్వాసం పెరిగిందని, వచ్చే ఎన్నికల్లో అధికారంలోకి వచ్చేది టీడీపీనే అన్నారు. ప్రభుత్వంపై పలు విమర్శలు చేశారు. టీడీపీ నియోజకవర్గ ఇన్‌చార్జ్ యనమల దివ్య, మూడు మండలాలు, పట్టణ నాయకులు పాల్గొన్నారు.

పాలిటెక్నిక్ అడ్మిషన్లు ప్రారంభించాలి

తుని: పాలిటెక్నిక్ ప్రవేశాల ప్రక్రియను తక్షణమే ప్రారంభించాలని ఎస్ఎఫ్ఐ కాకినాడ జిల్లా అధ్యక్షుడు జి.రాము సోమవారం ఓ ప్రకటనలో కోరారు. పాలిటెక్నిక్ పరీక్ష ఫలితాలు విడుదలై రెండు నెలలు కావస్తున్నా అడ్మిషన్లు ప్రారంభిండంలో రాష్ట్ర ప్రభుత్వం నిర్లక్ష్యం వహిస్తోందన్నారు. అడ్మిషన్ల ప్రక్రియ ప్రారంభించకపోవడం వల్ల పాలీసెట్‌లో ఉత్తీర్ణులైన 1.2 లక్షల మంది విద్యార్థులు సందిగ్ధంలో ఉన్నారన్నారు. డిప్లమా విద్యకు నానాటికీ ఆదరణ తగ్గిపోతుందని, ప్రభుత్వ చర్యలతో అది మరింత దిగజారిపోతుందని ఆవేదన వ్యక్తం చేశారు. రాష్ట్రంలో అన్ని సెట్ల అడ్మిషన్లు పూర్తయినప్పటికీ పాలిటెక్నిక్ అడ్మిషన్ల ప్రక్రియ పూర్తి కాకపోవడం బాధాకరమన్నారు. సంబంధిత అధికారులు స్పందించి వెంటనే వెబ్ ఆప్షన్ల ప్రక్రియ ప్రారంభించాలని, లేని పక్షంలో జిల్లా వ్యాప్తంగా ఆందోళన చేపడతామని హెచ్చరించారు.

పౌష్టికాహార కిట్ల పంపిణీ

శంఖవరం: పౌష్టికాహారంతోనే సంపూర్ణ ఆరోగ్యం సాధ్యమని వజ్రకూటం సర్పంచ్ సకురు గుర్రాజు అన్నారు. మండలంలోని వజ్రకూటంలో వైఎస్సార్ సంపూర్ణ పోషణ పథకం ద్వారా గర్భిణులు, బాలింతలకు అందించే టేక్ హోమ్ రేషన్ పంపిణీని సోమవారం ఆయన ప్రారంభించారు. గ్రామంలోని బాలింతలు, గర్భిణులకు అంగన్‌వాడీ కేంద్రాల్లో పౌష్టికాహారం కిట్లు పంపిణీ చేశారు. ప్రభుత్వం అందిస్తున్న పౌష్టికాహారాన్ని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు.

మద్యం విక్రయిస్తున్న వ్యక్తి అరెస్టు

జగ్గంపేట: మండలంలోని రామవరంలో ఎటువంటి లైసెన్సు లేకుండా మద్యం విక్రయిస్తున్న మొగలి గోవిందరాజులును అరెస్టు చేసినట్టు జగ్గంపేట ఎస్సై విద్యాసాగర్ సోమవారం తెలిపారు. అతని వద్ద నుంచి 10 మద్యం సీసాలను స్వాధీనం చేసుకున్నారు. నిందితుడిపై కేసు నమోదు చేసినట్లు ఎస్సై తెలిపారు.

మంత్రి రాజాకు 'కారుమూరి' పరామర్శ



దాడిశెట్టి రాజాను పరామర్శిస్తున్న మంత్రి కారుమూరి నాగేశ్వరరావు

తుని: రాష్ట్ర రోడ్లు, భవనాలశాఖ మంత్రి దాడిశెట్టి రాజాను రాష్ట్ర పౌర సరఫరాల శాఖ మంత్రి కారుమూరి నాగేశ్వరరావు పరామర్శించారు. సోమవారం సాయంత్రం తుని మండలం ఎస్.అన్నవరం క్యాంపు కార్యాలయంలో రాజా మాతృమూర్తి సత్యనారాయణమ్మ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. రాజా తండ్రి శంకరరావు, కుటుంబ సభ్యులకు ప్రగాడ సానుభూతి తెలిపారు.

వార్డు సభ్యుల ఎన్నికకు నోటిఫికేషన్

తొండంగి: మండలంలోని తొండంగి, శృంగవృక్షం పంచాయతీల్లో వార్డు సభ్యుల ఎన్నికకు నోటిఫికేషన్ విడుదల చేసినట్టు ఎంపీడీఓ పసుపులేటి సతీష్ సోమవారం తెలిపారు. శృంగవృక్షం పంచాయతీ ఆరో వార్డు, తొండంగి పంచాయతీలో 13వ వార్డు సభ్యులు మరణించిన కారణంగా ఆయా వార్డులకు ఎన్నికలు నిర్వహిస్తామన్నారు. ఈ నెల 8 నుంచి 10 వరకూ నామినేషన్లు స్వీకరణ, 11న పరిశీలన, 12 తిరస్కరణ, 14న నామినేషన్ల ఉపసంహరణ, తుది జాబితా ప్రకటన, 19న పోలింగ్, అదేరోజు మధ్యాహ్నం రెండు గంటల నుంచి ఓట్లు లెక్కించి ఎన్నికల ఫలితాలు ప్రకటిస్తామని వివరించారు.

2వ వార్డు ఉప ఎన్నికకు నోటిఫికేషన్

తుని రూరల్: మండలంలోని టి.తిమ్మాపురం పంచాయతీలో రెండో వార్డు ఉప ఎన్నికకు రాష్ట్ర ఎన్నికల కమిషన్ నోటిఫికేషన్ జారీ చేసినట్టు ఎంపీడీఓ పి.రవికుమార్ సోమవారం తెలిపారు. టి.తిమ్మాపురంలో రెండో వార్డు సభ్యుడు మృతి చెందడంతో ఏర్పడిన ఖాళీ భర్తీకి నోటిఫికేషన్ జారీ చేశామన్నారు. ఈ నెల 19న ఉప ఎన్నిక జరుగుతుందన్నారు. అభ్యర్థులు నెల 8 నుంచి 10వ తేదీ వరకు నామినేషన్ దాఖలు చే యాలన్నారు. పోటీలో నిలిచిన అభ్యర్థుల జాబితాను 14న ప్రకటిస్తామన్నారు. 19న ఎన్నిక నిర్వహించి అదేరోజు ఫలితం ప్రకటిస్తామన్నారు. అవసరమైతే రీ పోలింగ్ 20న నిర్వహిస్తామని ఎంపీడీఓ వివరించారు.